# వేగుచుక్క

VC NEWS

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ అక్టోబర్ 11 శుక్రవారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 88

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## రేవంత్ పాలనలో రైతులకు నిద్ర లేదు



2లో

## గ్రూప్-1 పరీక్షలకు వర్గీకరణ వర్తింపచేయాలి

అప్పుడే సీఎం రేవంత్‌ను నమ్ముతాం: మందకృష్ణ



2లో

## కొండా సురేఖపై కెటిఆర్ దావా

నాగార్జున కేసులో సురేఖకు కోర్టు నోటీసులు

రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా పేదలందరికీ ఒకేచోట అంతర్జాతీయస్థాయి సౌకర్యాలతో అత్యంత ప్రామాణికమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు నిర్మించనుంది.



# ఆదాయం ఎందుకు తగ్గింది?

వాణిజ్యపన్నుల ఉన్నతాధికారులపై సీఎం రేవంత్ సీరియస్

లొసుగులపై దృష్టిపెట్టాలని ఆదేశం

మూసీలో నిర్మాణాల తొలగింపునకు, రిజిస్ట్రేషన్లు తగ్గడానికి ఎలా ముడిపెడతారు?

ఆదాయ వనరులపై సీఎం సమీక్ష

హైదరాబాద్: ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరు అయిన వాణిజ్యపన్నుల శాఖ నుంచి ఆదాయం తగ్గడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. రావాల్సిన ఆదాయం కంటే గడిచిన ఆరేడు నెలల్లో ప్రతినెలా ఆదాయం రూ 650 కోట్ల మేరకు తగ్గడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదాయం తగ్గడానికి కారణాలేంటి? ఎక్కడ లొసుగులున్నాయో దృష్టిపెట్టాలని ఆదేశించారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే వాణిజ్యపన్నులు, రవాణా, మైనింగ్, ఎక్సైజ్ తదితర శాఖల ఉన్నతాధికారులతో గురువారం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వాణిజ్యపన్నుల లక్ష్యం రూ.85,126 కోట్లుగా ఉంటే.. ఏప్రిల్‌నుంచి సెప్టెంబర్‌వరకు రూ.42,034 కోట్లు ఆదాయం రావాల్సి ఉంది. అయితే ఇందులో రూ.37,315 కోట్లు మాత్రమే వచ్చింది. రూ.4,719 కోట్లు తక్కువ రావడంపై సీఎం సీరియస్ అయినట్లు సమాచారం.

### లక్ష్యాన్ని చేరుకోవాలి

ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరే విధంగా పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఆదాయ వసూళ్లపై నిక్కచ్చిగా ఉండాలని, అవసరమైతే సంబంధిత విభాగాన్ని పునర్‌వ్యవస్థీకరించుకోవాలని, సంస్కరణలు చేసుకోవాలని సూచించారు. ఆదాయాన్ని తెచ్చిపెట్టే ప్రతీశాఖ పనితీరును క్షుణ్ణంగా సమీక్షించారు. జీఎస్టీ చెల్లింపుల విషయంలో ఎవరినీ ఉపేక్షించరాదని హెచ్చరించారు.

అత్యధికంగా జీఎస్టీలో 4,086 కోట్లు, పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించి రూ.654 కోట్లు తక్కువగా వచ్చినట్లు తేలింది. రాష్ట్రంలో జీఎస్టీలో ఎంట్రీ కాకుండా చాలామంది కోట్ల రూపాయల వ్యాపారాలు చేస్తున్నారని. అటువంటి వారిని కూడా గుర్తించాలని ఆదేశించారు. మద్యం విక్రయాల్లో ఆదాయం మరింత పెరగాల్సిన అవసరం ఉందని చెప్పినట్లు తెలిసింది. అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టాలన్నారు.

### ఆర్‌ఆర్‌ఆర్‌తో సానుకూల వాతావరణం

రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ అభివృద్ధి ప్రాజెక్టులతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. వీటితోపాటు ఫోర్త్‌సిటీ, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, కొత్త ఎయిర్‌పోర్టులు వంటివాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. అయితే అనుకున్న స్థాయిలో ఈ నిర్ణయాలు ప్రజల్లోకి వెళ్లలేదని, గందరగోళానికి తావు లేకుండా చేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని చెప్పినట్లు తెలిసింది.ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు.

## ఆమ్రపాలికి షాక్.. 9 మంది ఏఐఎస్‌లు ఏపీకి!

- తెలంగాణ నుంచి ఏపీకి ఐదుగురు ఐఏఎస్‌లు.. ఏపీలోనే కొనసాగనున్న ఇద్దరు ఐఏఎస్‌లు
- తెలంగాణ నుంచి ఏపీకి ఐపీఎస్‌లు అంజనీకుమార్, అభిలాష్ భిష్త్
- ఏపీ నుంచి తెలంగాణ కేడర్‌కు మరో ముగ్గురు ఐఏఎస్‌లు
- ఏపీ, తెలంగాణ మధ్య ఏఐఎస్ అధికారుల తుది కేటాయింపులపై డీవోపీటీ కీలక నిర్ణయం
- ప్రస్తుత రాష్ట్ర కేడర్ నుంచి ఈ అధికారులను తక్షణమే రిలీవ్ చేస్తున్నట్లు ప్రకటన
- ఈ నెల 16లోగా పొరుగు రాష్ట్రంలో రిపోర్టు చేయాలని ఆదేశం



2లో



ఊరూవాడా సద్దులబతుకమ్మ సంబరాలు



# రతన్ టాటాకు కన్నీటి వీడ్కోలు

రతన్ టాటా మరణంతో దేశమంతా శోకతప్తం

టాటాతో అనుబంధం మరువలేనిది


రతన్ టాటా మృతికి రాష్ట్రపతి , ప్రధాని సంతాపం

దిగ్గజ పారిశ్రామికవేత్తను కోల్పోయామని నివాళి

రతన్ మృతికి రాహుల్ గాంధీ సంతాపం

ముంబయి: దిగ్గజ పారిశ్రామికవేత్త, పద్మవిభూషణ్ గ్రహీత, టాటా సన్స్ సంస్థ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా అంతిమయాత్ర ప్రారంభమైంది. ముంబయిలోని ఎన్‌సీపీఏ గ్రౌండ్ నుంచి వర్లి శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర సాగనుంది. మహనీయుడిని కడసారి చూసేందుకు వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. రతన్ టాటా అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం తరఫున అంత్యక్రియలకు హోమ్ మంత్రి అమిత్‌షా హాజరయ్యారు.

# తిరుమలలో బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు



### సూర్యప్రభ వాహనంపై ఊరేగిన స్వామి

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలు తిరుమలలో వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. సూర్యుడు తేజోనిధి, సకల రోగ నివారకుడు. ప్రకృతికి చైతన్యప్రదాత. వర్షాలు, వాటి వల్ల పెరిగే చెట్లు, చంద్రుడు, అతని వల్ల పెరిగే సముద్రాలు మొదలైనవన్నీ సూర్యతేజం వల్లనే వెలుగొందుతున్నాయి. సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుని దర్శనం వల్ల ఆరోగ్య, విద్య, ఐశ్వర్యం, సంతానం వంటి ఫలాలు భక్తకోటికి సిద్ధిస్తాయని నమ్మకం. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం మలయప్పస్వామి వారు చందప్రభ వాహనంపై విహరించి భక్తకులకు అభయమివ్వనున్నారు. చంద్రుడు శివునికి శిరోభూషణమైతే ఇక్కడ శ్రీహరికి వాహనంగా ఉండడం విశేషం. చంద్రోదయం కాగానే కలువలు వికసిస్తాయి. సాగరుడు ఉప్పొంగుతాడు. చందప్రభ వాహనంపై స్వామిని చూడగానే భక్తుల మనసు ఉప్పొంగుతుంది.

# రేవంత్ పాలనలో రైతులకు నిద్ర లేదు



**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతలను కష్టాలను వెంటాడుతూనే ఉన్నాయి. రేవంత్ పరిపాలనలో రైతు కంటి నిండా నిద్రపోయే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత విద్యుత్ కోసం పోరాటం, రైతుబంధు కోసం పోరాటం, రుణమాఫీ కోసం పోరాటం.. ఇలా అనేక రకాలుగా అన్నదాతలు రోడ్డెక్కుతూనే ఉన్నారు. చివరకు వరద పాలైన పంటలకు నష్ట పరిహారం చెల్లించడంలో కూడా రైతులను రేవంత్ ప్రభుత్వం నిలువునా మోసం చేసింది. వరదల్లో నిండా మునిగిన రైతాంగాన్ని.. వంచనతో మళ్లీ రేవంత్ సర్కార్ ముంచిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే.. వేల ఎకరాలకే అరకొర సాయం చేసి చేతులు దులుపుకోవడం అన్యాయం అని మండిపడ్డారు. 4.15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పిన మాటలు.. వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదిక వాస్తవం కాదా..? అని కేటీఆర్ నిలదీశారు. పంట నష్టం అంచనాలను తలకిందులుగా ఎందుకు మార్చేసారు..? ఏకంగా 3 లక్షల 35 వేల ఎకరాలు ఎట్లా ఎగిరిపోయాయి..? 79,574 ఎకరాలకే కంటి తుడుపుగా పరిహారం ఇచ్చి మమ అనిపించడం దారుణం..! అపార నష్టంతో అల్లాడుతున్న రైతుల ఆదుకునే విషయంలోనూ ఉదారంగా వ్యవహరించలేరా..? మానవత్వం ప్రదర్శించలేరా..? 5.20 లక్షల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి రాష్ట్రం రిపోర్ట్ ఇచ్చింది నిజం కాదా..? ఇప్పుడు ఇంత భారీ కోతలా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. పెట్టిన పెట్టుబడి కొట్టుకుపోయి.. రాళ్లు ఇసుక మేటలు వేసిన పొలాలను బాగుచేసుకోవడానికి మీరిచ్చే 10 వేలు ఏ మూలకూ సరిపోవు.. మరి అందులోనూ కుదింపులు చేయడం ఏమాత్రం సమంజసం కాదు..! అన్నదాత ఆపదలో వున్నప్పుడు ఆదుకోవడం.. ప్రభుత్వాల బాధ్యత..! ఆ బాధ్యత నుంచి తప్పించుకోకుండా నష్టం వాటిల్లిన ప్రతి ఎకరానికి పరిహారం అందించండి..! రుణమాఫీలో దగా జరిగింది.. రైతు భరోసా జాడా పత్తా లేదు.. వరదలు ముంచెత్తి నష్టాల్లో.. కష్టాల్లో కూరుకుపోయిన రైతులకు అండగా నిలవట్లేదు..! అన్నదాతపై ఎందుకీ వివక్ష..? అని రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు.

# కొండా సురేఖపై కెటిఆర్ దావా



**నాగార్జున కేసులో సురేఖకు కోర్టు నోటీసులు**

**హైదరాబాద్:** మంత్రి కొండా సురేఖపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. నాంపల్లి ప్రత్యేక కోర్టులో ఆయన తరపు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు దీనికి సంబంధించిన పిటిషన్ దాఖలు చేశారు. భారాస నేతలు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్‌ను సాక్షులుగా పేర్కొన్నారు. ఇటీవల కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ సినీరంగంలోని పలువురిని ప్రస్తావిస్తూ కేటీఆర్‌పై ఆరోపణలు చేశారు. కొండా సురేఖపై ఇప్పటికే ప్రముఖ సినీనటుడు నాగార్జున క్రిమినల్ పరువు నష్టం దావా వేసిన సంగతి తెలిసిందే. ఆమె తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. ఇదిలావుంటే నాగార్జున పిటిషన్ ఆధారంగా మంత్రి కొండా సురేఖకు నాంపల్లికోర్టు నోటీసులు జారీ చేసింది. తన కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున నాంపల్లి కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ ఈనెల 8న కోర్టును కోరారు నాగార్జున. అలాగే వాంగ్మూలం కూడా ఇచ్చారు. సాక్షిగా సుప్రియ వాంగ్మూలాన్ని కోర్టు రికార్డు చేసుకుంది. ఆపై ఈరోజుకు విచారణను వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై నాంపల్లి స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు గురువారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖకు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను ఈనెల 23కు నాంపల్లి కోర్టు వాయిదా వేసింది.

# ఊరూవాడా సద్దులబతుకమ్మ సంబరాలు

హైదరాబాద్ : తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబురాలు చేసుకున్నారు. మహిళలంతా తీరొక్క పువ్వులతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మ సంబురాలతో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలు వెలుగులీనాయి. వేలాదిమందితో బతుకమ్మ ర్యాలీ నిర్వహించారు. అలాగే ట్యాంక్ బండ్ పరిసరాలు మహిళల సందడితో కళకళ లాడింది. ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూడి సిఎం మల్లు భట్టి విక్రమార్కలు సంబురాలకు హాజరయ్యారు. వందలాది మంది మహిళలు 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడిపాడారు. వేలాది మంది మహిళలతో హనుమకొండ పద్మాక్షి అమ్మవారి గుండం కిక్కిరిసిపోయింది. వికారాబాద్ జిల్లా తాండూరులో మహిళలు భక్తి శ్రద్ధలతో బతుకమ్మ ఆడారు. కరీంనగర్, నల్గొండ, అదిలాబాద్ తదితర జిల్లాల్లో బతుకమ్మ సంబరాలు కోలాహలంగా సాగుతున్నాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ సంబురాలు నేటితో ముగిసాయి. తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. గురువారం చివరి రోజైన సద్దుల బతుకమ్మ కావడంతో తెలంగాణ గల్లీగల్లీ నుంచి హైదరాబాద్ బస్తీల వరకు వేడుకలు ఆకాశాన్ని అంటాయి. ఇటు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో మంత్రి సీతక్క సహ పలువురు మహిళ నేతలు, మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనగా.. మరోపక్క ఊరూవాడా పూలవనంలా మారిపోయింది. మహిళలు, యువతులు, చిన్నారుల ఆటపాటలతో రాష్ట్ర వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. అక్టోబర్ 2న ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగుస్తున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం నుంచే బతుకమ్మ సంబురాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. దీంతోపాటు బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించి గౌరవించింది. బతుకమ్మల నిమజ్జనానికి ఊళ్లలో ఉండే చెరువులతో పాటు హైదరాబాద్ వాసులు తమ సమీప నీటి వనరులను ఉపయోగించుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు రాజ్‌భవన్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సతీమణి సుధాదేవ్ పాల్గొన్నారు.

## ఢిల్లీలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టివేత

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. రమేష్ నగర్‌లో 200 కిలోల కొకైన్‌ను స్పెషల్ సెల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన కొకైన్ విలువ దాదాపు రూ.2000 కోట్లు ఉంటుందని వెల్లడించారు. జీపీఎస్ ద్వారా డ్రగ్స్ స్మగ్లర్స్‌ను కదలికలను ట్రాక్

చేసిన పోలీసులు.. పక్కా ఎ÷-లాన్ ప్రకారం ఇవాళ పశ్చిమ ఢిల్లీలోని రమేష్ నగర్‌లో సోదాలు చేసి పెద్ద ఎత్తున డంప్ చేసిన కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. తమ రాకను ముందే పసిగట్టిన నిందితులు లండన్?కు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఇదే వారంలో ఢిల్లీలో రూ.5,600 కోట్ల విలువైన 500 కేజీల కొకైన్ పట్టుబడిన విషయం తెలిసిందే. దీంతో వారం వ్యవధిలోనే దేశ రాజధానిలో రూ.7,000 కోట్ల విలువైన కొకైన్ పట్టుబడింది. ఇవాళ పట్టుబడిన కొకైన్?కు ఇంతకు ముందు దొరికిన డ్రగ్స్?కు లింక్ ఉందని అధికారులు వెల్లడించారు. వారం వ్యవధిలోనే రూ.7,500 కోట్ల విలువైన 762 కిలోల డ్రగ్స్‌ను సీజ్ చేశామని.. దేశంలోనే అతిపెద్ద డ్రగ్స్ రవాణా ఇదేనని అధికారులు తెలిపారు. ఈ భారీ కొకైన్ రవాణా వెనుక అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ సిండికేట్ హస్తం ఉందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రత్యేక డ్రగ్ సిండికేట్ -భారత్?లోని ఢిల్లీ, ముంబైలలో కార్యకలాపాలు నిర్వహిస్తోందని.. వీరికి- దుబాయ్‌తో కూడా లింకులు ఉన్నాయని పేర్కొన్నారు.

## గ్రూప్-1 పరీక్షలకు వర్గీకరణ వర్తింపచేయాలి

**అప్పడే సిఎం రేవంత్‌ను నమ్ముతాం: మందకృష్ణ**



హైదరాబాద్: మాదిగలను నమ్మించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని ప్రకటనలు చేసినా, నమ్మే పరిస్థితి లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయకుండానే 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లకూ వర్గీకరణ వర్తింపజేస్తామని చెప్పి, అమలు చేయకుండానే టీచర్ పోస్టులు భర్తీ చేశారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి శాసనసభలో చెప్పిన మాటలకే విలువలేదని విమర్శించారు. శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తామంటే అనుమతి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వమే కాదు.. రేవంత్ ప్రభుత్వం కూడా నిర్బంధాలతోనే నడుస్తోందని ఆరోపించారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు వర్గీకరణ వర్తింపజేయాలని.. లేదంటే వర్గీకరణ తర్వాతే గ్రూప్-1 పరీక్ష నిర్వహించాలని, గ్రూప్-3 పరీక్షలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-4 ఫలితాలు ఇప్పటికే 16 నెలలు ఆగాయని, వర్గీకరణ జరిగే వరకు మరో 2 నెలలు వాయిదా వేయాలని కోరారు. ఈ నెల 16న వరంగల్‌లో భారీ సమావేశం నిర్వహిస్తామన్న ఆయన.. ఆ సమావేశంలో అన్ని కమిటీల సభ్యులు పాల్గొంటారని అన్నారు. ఇప్పటివరకు ఆవేదనతోనే నిరసన చేశామని.. ఇకపై తమ ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.



# రతన్ టాటాకు చంద్రబాబు నివాళి

**ముంబై/అమరావతి:** పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు ఎపి సిఎం చంద్రబాబు నివాళి అర్పించారు. దిగ్గజ పారిశ్రామికవేత్త, పద్మవిభూషన్ గ్రహీత, టాటా సన్స్ సంస్థ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా భౌతికకాయానికి ఏపీముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. ముంబయిలోని ఎన్‌సీపీఏ గ్రౌండ్‌లోని పార్థివదేహం ఎదుట పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తోపాటు, గ్రూప్ ఉన్నతాధికారులు, టాటా కుటుంబ సభ్యులతో చంద్రబాబు మాట్లాడారు. వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రతన్ టాటా లాంటి మహోన్నతమైన వ్యక్తి ఈ లోకాన్ని వీడిపోవడం తీరని లోటన్నారు. ప్రత్యేక విమానంలో ముంబై వచ్చిన బాబు నేరుగా టాటా భౌతిక కాయం సందర్శించి నివాళి అర్పించారు. అంతకు ముందు సచివాలయలంఓ సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ భేటీ ముగిసింది. అజెండా అంశాలపై చర్చను క్యాబినెట్ వాయిదా వేసింది. రతన్ టాటా మృతికి సంతాపం ప్రకటించింది. భేటీకి ముందు ఆయన చిత్రపటం వద్ద సీఎం చంద్రబాబు, మంత్రులు నివాళి అర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ముంబయికి బయలుదేరారు. రతన్ టాటా పార్థివ దేహానికి వారు నివాళులర్పించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కొందరు మాత్రమే తమ అడుగుజాడలు వెళుతూ వెళుతూ ఈ భూమిపై వదిలి వెళతారని, తమ దూరదృష్టి, సమగ్రతలతో రతన్ టాటా అదే చేశారని అన్నారు. మనం కేవలం ఒక గొప్ప వ్యాపారవేత్తనే కాదు గొప్ప మానవతావాదిని కోల్పోయామని, కేవలం పారిశ్రామిక వారసత్వంలోనే కాకుండా ఆయన అందరి హృదయాలను స్పృశించి వెళ్ళారన్నారు. ఆయన పారిశ్రామిక రంగానికి చేసిన సేవ, జాతి నిర్మాణం లోనూ, పరోపకారి గుణంలోనూ తరతారాలలో మార్పును తెచ్చిందని కొనియాడారు. ఆయన గొప్ప వారసత్వాన్ని మనకు వదిలి వెళ్ళారని, టాటా గ్రూప్‌కు, ఆయనను ప్రేమించేవారికి బాధా తప్త హృదయంతో సంతాపం తెలియజేస్తున్నానని సీఎం చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. విలువలు, మానవత్వంతో కూడిన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన మహా దార్శనికుడు రతన్ టాటా అని మంత్రి లోకేష్ అన్నారు. దేశాభివృద్ధి, ప్రజా శ్రేయస్సు, ఉద్యోగుల సంక్షేమమే పరమావధిగా టాటా గ్రూప్ సంస్థలను దశాబ్దాలుగా అదే నిబద్ధతతో నిర్వహించిన పద్మవిభూషణ్ రతన్ టాటా సేవలు చిరస్మరణీయమని అన్నారు. టాటా గ్రూప్ ఉత్పాదనలు వాడని భారతీయులు ఉండరని, మన దేశంలో ఏ మూల ఏ విపత్తు సంభవించినా భారీ విరాళంతో స్పందించే మానవత్వపు హృదయం రతన్ టాటాదని, నిజాయితీని, నిస్వార్థపరత్వాన్ని టాటా బ్రాండ్‌గా చేసిన రతన్ టాటాకు మరణం లేదని ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారని అన్నారు. నమ్మకమైన టాటా ఉత్పత్తుల రూపంలో ప్రతి ఇంట్లోనూమనందరినీ ప్రతిరోజూ చిరునవ్వుతో పలకరిస్తూనే ఉంటారని.. రతన్ టాటా నిరుపమానమైన సేవలను స్మరిస్తూ, అశ్రు నివాళులు అర్పిస్తున్నానని మంత్రి లోకేష్ అన్నారు.ముంబయిలోని ఎన్‌సీపీఏ గ్రౌండ్‌లో రతన్ టాటా పార్థివ దేహాన్ని ప్రజలు, ప్రముఖుల సందర్శనార్థం ఉంచారు. మధ్యాహ్నం 3.30 గంటలకు అంతిమ యాత్ర ప్రారంభం కానుంది. మహారాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో సాయంత్రం రతన్ టాటా అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## ఎపి కేబినేట్ ఘనంగా నివాళి

## కెసిఆర్‌ను విమర్శించకుండా ఉండలేరా



**హైదరాబాద్:** ఎక్కడ పడితే అక్కడ.. విద్యార్థులు, టీచర్ల ముందు కేసీఆర్‌ను విమర్శించడమే మీ విధానమా..? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా రెడ్డి సూటిగా ప్రశ్నించారు. గడిచిన పది నెలలలో కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్క సభలో అయినా మాట్లాడారా..? అని అడిగారు. నిన్న డీఎస్సీ నియామక పత్రాల అందజేత సందర్భంగా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి విమర్శించిన తీరుపై సబితా ఇంద్రారెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. రేవంత్ రెడ్డి మాట్లాడేటప్పుడు అది ప్రభుత్వ కార్యక్రమా లేక పార్టీ కార్యక్రమా మర్చిపోతున్నారు. మీరు ఇచ్చాం అని చెప్తున్న టీచర్ పోస్టులు కేసీఆర్ మంజూరు చేసినవి కావా..? ఉన్నత విద్యాశాఖలో 3202 పోస్టులు, యూనివర్సిటీలలో 1081 పోస్టులు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసినవి కావా..? అని సబితా ఇంద్రారెడ్డి నిలదీశారు. ఇంటర్, టెక్నికల్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ సంబంధించి 3896 కాంట్రాక్టు ఉద్యోగులను కేసీఆర్ రెగ్యులర్ చేశారు అని చెప్తే బాగుండేది. ఎన్నికల ముందు మీరు చెప్పిన 25,000 టీచర్ పోస్టులు ఎందుకు ఇవ్వలేదు అని ఆ గురువుల ముందు చెప్తే బాగుండేది. ఎన్నికలప్పుడు 6000 పాఠశాలలు మూతపడ్డాయి అని అబద్దం చెప్పిన మీరు, ఆ పాఠశాలల లిస్ట్ విడుదల చేస్తే బాగుండేది. మన ఊరు మన బడి కార్యక్రమం ఎందుకు ఆపేశారో చెప్తే బాగుండేది. 6 లక్షల మంది పేద విద్యార్థులు చదువుతున్న కేసీఆర్ ప్రవేశ పెట్టిన గురుకులాలను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేద్దాం అనుకుంటున్నది అని చెప్తే బాగుండేది. ప్రభుత్వ పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ఎందుకు ఆపేశారో చెప్తే బాగుండేది. ఎన్నికల సమయంలో చెప్పినట్టు ప్రతి విద్యార్థికి 5 లక్షల విద్య భరోసా కార్డు ఎప్పుడు ఇస్తారో చెప్తే బాగుండేది. 19 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్న మీరు మిగితా పాఠశాలలను గాలికి వదిలేశాము అని చెప్తే బాగుండేది అని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు.

## ఆమ్రపాలికి షాక్.. 9 మంది ఏఐఎస్‌లు ఏపీకి!

హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య అఖిల భారత సర్వీసుల (ఏఐఎస్) అధికారుల తుది కేటాయింపుల విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. తమను ఏపీ కేడర్‌కు బదులుగా తెలంగాణ కేడర్‌కు కేటాయించాలన్న ఏడుగురు ఐఏఎస్, ఇద్దరు ఐపీఎస్ అధికారుల విజ్ఞప్తులను తిరస్కరించింది. వారిలో ఇద్దరు ఐఏఎస్ అధికారులు ప్రస్తుతం ఏపీలోనే పనిచేస్తుండగా మిగిలిన ఐదుగురు తెలంగాణలో పనిచేస్తున్నారు. అదేవిధంగా తమను తెలంగాణ కేడర్‌కు బదులు ఏపీ కేడర్‌కు కేటాయించాలన్న మరో ముగ్గురు ఐఏఎస్ అధికారుల విజ్ఞప్తులనూ తిరస్కరించింది.తక్షణమే వారిని ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్ర కేడర్ నుంచి రిలీవ్ చేయడంతోపాటు ఈ నెల 16లోగా పొరుగు రాష్ట్రంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ(డీవోపీటీ) వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఈ ఉత్తర్వులను అమలు చేయాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించిన ఐఏఎస్ అధికారులు షంషేర్ సింగ్ రావత్, జి.అనంతరాము ప్రస్తుతం ఆ రాష్ట్రంలోనే పనిచేస్తూ తమను తెలంగాణకు కేటాయించాలని విజ్ఞప్తి చేయగా ఆ విజ్ఞప్తిని కేంద్రం తిరస్కరించి వారిద్దరినీ ఏపీలోనే కొనసాగాలని ఆదేశించింది. మిగిలిన వారంతా ప్రస్తుతం తాము పనిచేస్తున్న రాష్ట్రాన్ని వదిలేసి పొరుగు రాష్ట్రానికి వెళ్లకతప్పని పరిస్థితి ఏర్పడింది. వివాదం నేపథ్యం ఇది... రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యుష్ సిన్హా కమిటీ సిఫారసుల ఆధారంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఏఐఎస్ అధికారుల కేటాయింపులను కేంద్రం చేపట్టింది. ఐఏఎస్ అధికారులు సోమేశ్‌కుమార్, కాటా ఆమ్రపాలి, జి.అనంతరాము, ఎం.ప్రశాంతి, వాకాటి కరుణ, ఎ.వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్, ఎస్ఎస్ రావత్‌లను ఏపీ కేడర్‌కు.. హరికిరణ్, జి. సృజన, శివశంకర్ లహొటిలను తెలంగాణ కేడర్‌కు కేటాయించింది. ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష బిష్త్, అభిషేక్ మహంతిని ఏపీకి కేటాయించారు. అయితే ఈ కేటాయింపులను సవాల్ చేస్తూ ఆయా ఐఏఎస్, ఐపీఎస్‌లు గతంలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. వారి వాదనలు విన్న ట్రిబ్యునల్.. ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాలను కొట్టేస్తూ 2017లో తీర్పు ఇచ్చింది.

వేగుచుక్క
TELUGU DAILY NEWS



# ఘనంగా సద్దుల "బతుకమ్మ" సంబరాలు.

**ఆట, పాటలతో ఆడపడుచుల ఆనందాలు.**

**ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు.**

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, అక్టోబర్ 10:**

సద్దుల బతుకమ్మ సంబరాలు గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఊరు, వాడ, పల్లె, పట్నం తేడా లేకుండా ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆట, పాటలతో సంబరాలు చేసుకున్నారు. కుటుంబ సభ్యులతో చెరువు వద్దకు చేరుకుని, బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అనంతరం వెంట తెచ్చుకున్న సద్దులను ఇరుగుపొరుగు వారితో కలిసి అక్కడే ఆరగించారు.

కాగా, నగరంలోని వినాయక నగర్, న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో గల హనుమాన్ మందిర్ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ ఏర్పాట్లను పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దీనితో న్యూ హౌసింగ్ బోర్డు, ఓల్డ్ హౌసింగ్ బోర్డు తదితర కాలనీల ఆడపడుచులు భారీగా తరలివచ్చారు. అందంగా ముస్తాబు చేసిన బతుకమ్మలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ అధ్యక్షులు దాసరి లక్ష్మి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సిహెచ్. బాల్ సింగ్,
ఉపాధ్యక్షులు
కంచెట్టి లక్మన్, సిద్దిరాములు, సహాయ కార్యదర్శి కమలకర్ రెడ్డి, కాలనీ పెద్దలు దశరథ్, ప్రభాకర్, రత్నాకర్ గౌడ్, ప్రభాకర్, వెంకటేష్, నర్సింలు తో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.















# రుషితుల్యుడు.. మన రతన్ టాటా !

భారతదేశం నిజంగానే పుణ్యదేశం...ఈ మట్టి మహిమేమో కానీ పలు సందర్భాల్లో పుణ్యపురుషులు ఉద్భవిస్తూనే ఉంటారు. మన అదృష్టం ఏమంటే రతన్ టాటా లాంటి ఓ పుణ్య పురుషుడిని మనతరంలో మనమంతా కళ్లముందు చూశాం. నమంతా ఇప్పుడు రతన్ టాటా అనే ఓ మహానుభావుడిని ప్రత్యక్షంగా చూశాం. ఆయన గురించి తెలుసుకున్నాం. ఆయన చర్యలను గమనించాం. ఆయన దేశం కోసం తపించి.. ఈ దేశ యువతకు మర్గనిర్దేశనం చేసేందుకు పడిన శ్రమను చూశాం. ఓ పారిశ్రామిక దిగ్గజంలా కాకుండా ఈ దేశాన్ని ముందుకు నడిపించే చోదకుడిలా టాటా ఎప్పుడూ ఆలోచించేవారు. ఇతర పారిశ్రామికవేత్తలకు రతన్ టాటా భిన్నం. ఆయన ఆలోచనలు భిన్నం. ఆయన నడవడి భిన్నం. ఆడంబరాలకు ఆయన దూరం. సన్మానాలంటే పెద్దగా ఇష్టం ఉండదు. రతన్ టాటా జీవితమంతా సింప్లిసిటీకి మారు పేరు. ఆయన జీవితాన్ని పరిశీలిస్తే రామాయణంలో జనకుని పాత్ర లాంటి ఎన్నో ఉదాహరణలు దొరుకుతాయి! అలాంటి ఓ మహానుభావుడు టాటా సంస్థను దిగ్గజ సంస్థగా ప్రపంచ వ్యాపార రంగంలో తీర్చి దిద్దారు. అలాగే నిజాయితీగా వ్యాపారం చేశారు. ఉప్పు నుంచి..విమానం వరకు స్పృషించని రంగాలు లేవు. నిజంగా యువతకు ఆయన ఓ రోల్ మోడల్. ఎలా ఎదగాలో..ఎలా మసలు కోవాలో..ఎలా వ్యాపారాన్ని నిజాయితీగా విస్తరించాలో అన్నదానికి కూడా ఆయన రోల్ మాడల్. తన వ్యాపారం కోసం ఏనాడూ రాజకీయ నేతల చుట్టూ తిరిగిన సందర్భాలు లేవు. ఆయన చుట్టే రాజకీయ నేతలు తిరిగి..తమ రాష్ట్రాల్లో వ్యాపారాన్ని పెట్టాలని అర్థించేవారు. రతన్ టాటా మరణంతో భారత దేశ పారిశ్రామిక చరిత్రలో ఒక శకం ముగిసింది! జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య యవనికపై తనదైన ముద్ర వేసిన పారిశ్రామిక వేత్త, చైర్మన్ ఎమెరిటస్ ఆఫ్ టాటా సన్స్.. రతన్ నావల్ టాటా (86) ఇక లేరు అన్న విషయం నిజంగానే జీర్ణించుకోలేని వార్త. దేశం కోసం తపించిన ఓ తపస్వి నింగికేగాడు. తన జ్ఞాపకాలను , తన వ్యాపార సామ్రాజ్యాన్ని మనకు వదిలేసి కనిపించని లోకాలకు చేరుకున్నాడు. ఎంతటి పుణ్యం చేసుకుంటే తప్ప ఇంత గొప్ప జన్మ దక్కదు. వంటగదిలో వాడే ఉప్పు నుంచి.. ఆకాశంలో ఎగిరే విమానాల దాకా.. ఎన్నెన్నో ఉత్పత్తులు, సేవలతో భారతీయుల నిత్యజీవితంలో భాగమైన టాటా సామ్రాజ్యాన్ని రెండు దశాబ్దాలపాటు నడిపించిన ఆ పారిశ్రామిక దిగ్గజం.. మరలిరాని లోకాలకు తరలిపోయారు! అత్యంత నిరాడంబరంగా జీవించిన రతన్ టాటా అవివాహితుడు. ముంబయిలోని అత్యంత చిన్న ఇంట్లో ఆయన నివసించేవారు. తన టాటా సెడాన్ కారును ఆయనే నడిపేవారు. ప్రైవసీని ఎక్కువగా ఇష్టపడేవారు. మీడియా ప్రచారానికి దూరంగా ఉండేవారు. తనతోపాటు పుస్తకాలను, సీడీలను, పెంపుడు కుక్కలను ఉంచుకునేవారు. రతన్ టాటా సేవాగుణంలో అత్యున్నతుడు. 1970లలోనే ఆయన సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ఆగాఖాన్ ఆసుపత్రి, వైద్య కళాశాలకు శ్రీకారం చుట్టారు. 1991లో ఆయన టాటా సన్స్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక, టాటా గ్రూప్ సేవా కార్యక్రమాలు కొత్త రూపును సంతరించుకున్నాయి. టాటా ట్రస్టులను మరింతగా విస్తరించారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌ను స్థాపించారు. విద్యా రంగానికి మరింత ప్రోత్సాహమిచ్చారు. దేశంలోని అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యానికి అధినేత రతన్‌టాటా. కానీ, ఆయన ఎంతో వినయంగా ఉంటారు. ప్రచారాలకు, ఆర్భాటాలకు దూరంగా.. సాధారణ జీవనశైలితో ఉండటానికి ఇష్టపడతారు. రతన్ టాటా నాయకత్వంలో.. టాటా గ్రూప్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది, జాగ్వార్, ల్యాండ్ రోవర్, కోరస్ స్టీల్ వంటి పెద్ద పెద్ద కంపెనీలను కొనుగోలు చేసింది. ఆయన టాటా కంపెనీని బహుళజాతి కంపెనీగా మార్చారు. సంస్థ విలువను నిలుపుకుంటూనే టాటా గ్రూప్‌ను ప్రపంచ బ్రాండ్‌గా మార్చారు. రతన్ టాటా దాతృత్వానికి పెట్టింది పేరు. టాటా గ్రూప్ సంపదలో అధిక భాగం టాటా ట్రస్ట్‌ల ద్వారా ధార్మిక కార్యక్రమాలకు కేటాయించేవారు. ఆయన ఎల్లప్పుడూ నైతిక వ్యాపార పద్ధతులను పాటిస్తూ.. సామాజిక బాధ్యత తీసుకోవాలని చెబుతుంటారు. రతన్ టాటా ఎప్పుడూ వినూత్నంగా ఆలోచించేవారు. ఆయన తీసుకున్న ఎన్నో సాహసోపేత నిర్ణయాలు సంస్థను ముందుకు తీసుకెళ్లేందుకు దోహదపడ్డాయి. ప్రపంచంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలలో రతన్ టాటా ఒకరు. అయితే ఆయన చెప్పుకో దగ్గ వ్యాపార దిగ్గజాలతో కలసి ఎక్కడా కనిపించే వారు కాదు. ఉప్పు నుంచి ఉక్కు వరకు టాటాలు ప్రవేశించని రంగమే లేదు. ఏ వ్యాపారమైనా నాణ్యతే, నమ్మకమే లక్ష్యంగా అంచెలంచెలుగా ఎదిగిన టాటా గ్రూప్ ప్రస్థానంలో రతన్ టాటా కృషి అసామన్యమైనది. ఆయన దగ్గరుండి వ్యవపారాన్ని నమ్మంతో ముందుకు నడిపించారు. టాటా ఉత్పత్తి అంటే నమ్మకం అన్న భావన కలిగించారు. అది భారతీయుల్లో విడదీయరాని బంధంగా మారింది. అత్యంత సాధారణ జీవితం గడుపుతూనే 6 ఖండాల్లోని వందదేశాల్లో టాటా గ్రూపునకు చెందిన 30 కంపెనీలకు ఆయన నేతృత్వం వహించారు. నిత్య మార్గదర్శ కుడిగా, దాతృత్వశీలిగా, మానవతావాదిగా నిలిచిన రతన్ టాటా.. ప్రపంచంలోనే దిగ్గజ వ్యాపారవేత్తల్లో ఒకరిగా ఎదిగారు. రతన్ టాటా ఎప్పుడూ లాభాల కంటే చిత్తశుద్ధికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆయన ఎంతో వినయంగా ఉంటారు. ప్రచారాలకు, ఆర్భాటాలకు దూరంగా.. సాధారణ జీవనశైలితో ఉండటానికి ఇష్ట పడతారు. రతన్ టాటాకు ఉన్న ఈ ప్రత్యేక లక్షణాలే ఆయనను కార్పొరేట్ టైటాన్‌గా నిలబెట్టాయి. కార్ల రంగంలో దిగ్గజ కంపెనీగా నిలబెట్టినా.. సామాన్యులకు కారును అందుబాటులోకి తీసుకుని రావాలని తపించారు. ఆయన తపనలోంచి వచ్చిందే నానో కారు. కేవలం లక్షకే నానో కారును మార్కెట్లో ప్రవేశ పెట్టారు. అలా రతన్ టాటా 2009లో సామాన్యుల కోసం రూ. లక్షకే నానో పేరుతో చీపెస్ట్ కారును మార్కెట్లోకి తీసుకొచ్చారు. ప్రజలపట్ల ఉన్న ప్రేమకు ఇది నిదర్శనంగా చూడాలి. ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన గొప్పతనం అంతాఇంతాకాదు. ఆయన మన నేలపై నడయాడిన ఓ రుషితుల్యుడు.

# బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే.





**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, అక్టోబర్ 10:**

నగరంలో గురువారం జరిగిన సద్దుల బతుకమ్మ సంబరాల్లో అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త పాల్గొన్నారు. ప్రకృతిని పార్వతిగా, పూలనే గౌరమ్మగా ఆరాధించే బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మ తల్లి మన అందరి కుటుంబాలల్లో ఆనందాల కాంతులు నింపాలనీ అమ్మవారిని మొక్కుకున్నట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# హిట్ అండ్ రన్ కేసులలో సత్వర విచారణ.

## - మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 10**



: గుర్తు తెలియని వాహనాలు ఢీకొని మృతి చెందిన, తీవ్రంగా గాయపడిన (హిట్ అండ్ రన్) కేసులలో బాధితులకు, వారి కుటుంబీకులకు చట్ట ప్రకారం నష్ట పరిహారం మంజూరు చేసేందుకు వీలుగా త్వరితగతిన విచారణ జరపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆయా డివిజన్ల ఆర్డీఓలను ఆదేశించారు. కలెక్టర్ అధ్యక్షతన ఆయన ఛాంబర్లో గురువారం హిట్ అండ్ రన్ కేసుల జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో 32 హిట్ అండ్ రన్ కేసులు నమోదవగా, వాటిలో 27 ప్రమాద ఘటనలకు సంబంధించి బాధిత కుటుంబాలు గుర్తించబడినాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వీటిలో నిజామాబాద్ డివిజన్ పరిధిలో 17, ఆర్మూర్ డివిజన్లో 7, బోధన్ డివిజన్లో 3 కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, హిట్ అండ్ రన్ కేసులలో మృతి చెందినట్లైతే చట్ట ప్రకారం సాధారణ బీమా కౌన్సిల్ ద్వారా బాధిత కుటుంబీకులకు రూ. 2 లక్షలు, తీవ్రంగా గాయపడితే బాధితులకు రూ. 50 వేలు నష్ట పరిహారం అందించాల్సి ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బాధితులకు పరిహారం మంజూరు చేసేందుకు వీలుగా త్వరితగతిన సమగ్ర విచారణ జరిపి నివేదికలు సమర్పించాలని ఆర్డీఓలకు సూచించారు. విచారణ నివేదిక రూపకల్పనకు అవసరమైన వివరాలను ఆర్డీఓలకు అందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాప్యానికి తావులేకుండా బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని, అదే సమయంలో అన్ని వివరాలను సమగ్రంగా పరిశీలన చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు డీసీపీ బస్వారెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, కలెక్టరేట్ కార్యాలయ పర్యవేక్షకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి ఉద్యమాల దిక్సూచి పిడియస్ యు.

## - జేసిఎస్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్టీ గొర్రెపాటి మాధవరావు.

**వేగుచుక్క న్యూస్, బోధన్, అక్టోబర్ 10**








విద్యార్థి ఉద్యమాల దిక్సూచి పిడియస్ యు అని, శాస్త్రీయ విద్య విధానం , కామన్ విద్యా విధానం, సమసమాజం లాంటి ఉన్నతమైన లక్ష్యాలతో ఏర్పడిన పిడిఎస్ యు సంస్థ 50 వసంతాల సందర్భంగా, అర్థ శతాబ్దా వారోత్సవాల సభ జరుపుకోవడం మంచి పరిణామం అని జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ మేనేజింగ్ ట్రష్టి నిర్వాహకులు గొర్రెపాటి మాధవరావు అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పిడిఎస్ యు నిర్మాత జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ సొంత గ్రామంమైన కోటగిరి మండలం, ఎత్తొండలో అర్థ శతాబ్ద వారోత్సవ ప్రారంభ సభను గురువారం ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి జేసీఎస్ ప్రసాద్ సోదరి కాజా కామేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గొర్రె పాటి మాధవ రావు మాట్లాడుతూ, విద్యార్థులు హక్కుల సాధన కోసం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిత్యం సమారశీల పోరాటాలు నిర్వహించి విద్యార్థి పోరాటాల దిక్సూచిగా పిడిఎస్ యు నిలిచిందన్నారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం పాఠశాలల్లో, కళాశాలలో, హాస్టల్లో సౌకర్యాల కోసం, ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం, రాష్ట్ర సాధన కోసం అనేక ఉద్యమాలు చేపట్టిందన్నారు. లాఠీ చార్జీలు, కేసులను సైతం ఎదుర్కొని పోరాటాలు నిర్వహించిందని అన్నారు. గత పోరాటాలను సమీక్షించుకొని, ప్రస్తుతం ఉన్న విద్యా కార్పొరేట్ కరణ ప్రైవేటీకరణ , కాషాయకరణకు వ్యతిరేకంగా పిడిఎస్ యూ ఉద్యమిస్తుందని అన్నారు. కాజా కామేశ్వరీ మాట్లాడుతూ, తన తమ్ముడు ఎలాంటి తప్పు చేయకుండా విద్యార్థి హక్కుల కోసం పోరాడినందుకు నాటి ఎమర్జెన్సీ కాలంలో కాల్చి చంపారని, ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న జంపాల ప్రసాద్, చదువు అయిపోతే ఇంటికి తిరిగి వస్తాడని చాలా ఎదురు చూశాం, కానీ కనీసం మృతదేహం కూడా చూపించక పోవడం చాలా బాధ కలిగించిందన్నారు. కానీ తన తమ్ముడి ఆశయాలను, ఆయన స్థాపించిన పిడిఎస్యు ను 50 సంవత్సరాలు పూర్తి చేసుకుని అర్థ వారోత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రసాద్ చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకొని ప్రస్తుత సమస్యలపై పోరాడాలని పిలుపు నిచ్చారు.పిడిఎస్ యు పూర్వ రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్ మాట్లాడుతూ, పి డి ఎస్ యు పోరాటాల మూలంగానే అనేక సంక్షేమ హాస్టల్లల్లో కనీస వసతులు, పాఠశాలలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు వచ్చారని అన్నారు. యూనివర్సిటీలలో ర్యాగింగ్ లను అరికట్టి అమ్మాయిలకు రక్షణగా పి డి ఎస్ యు నిలిచిందని పేర్కొన్నారు. పిడిఎస్ యు తొలి తరం నాయకులు ఆకుల పాపయ్య మాట్లాడుతూ, విద్యా, ఉపాధి అవకాశాలు అందరికీ అందాలంటే పిడిఎస్ యూ లాంటి సంస్థ మాత్రమే పోరాడ గలుగుతుందని అన్నారు. విద్యార్థుల సమస్యలే కాకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయడం స్ఫూర్తి దాయకం అని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షతగా పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు గౌతమ్ కుమార్ వ్యవహరించగా, జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, ప్రస్తుత పూర్వ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.